ఎస్‌పి కార్యాలయ భవనం పరిశీలన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్‌పి కార్యాలయం ఏర్పాటు కోసం పలు భవనాలను పరిశీలించిన అధికారులు ఆఖరికి మదనపల్లె ఆరోగ్యమాత స్కూల్ సమీపంలోని రేస్ కాలేజ్ భవనాన్ని ఎంపిక చేశారు. రెండు రోజులుగా ఎస్‌పి కార్యాలయం రూపుదిద్దుకుంటోంది. ఈ క్రమంలో ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి డిఎస్‌పి మహేంద్రతో కలిసి శనివారం ఎస్‌పి కార్యాలయం ఏర్పాటు చేయబోయే భవనాన్ని పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో ఉన్న అన్ని శాఖలకు ఏఏ భవనాలు అనుకూలంగా ఉంటాయో పరిశీలించి తగు సలహాలు, సూచనలు చేశారు. ఇక నుంచి ఎస్‌పి కార్యాలయం నుంచి అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఎస్‌పి వెంట జిల్లా పోలీసు అధికారులు ఉన్నారు.

కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి ధీరజ్

స్వయం ఉపాధికి మోక్షమెప్పుడో?

రూ.54.47 కోట్ల రుణాలకు బ్రేక్

జిల్లాలో 2,245 యూనిట్ల నిరీక్షణ

ఫైనాన్స్‌లో బిఆర్‌ఒ పెండింగ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో స్వయం ఉపాధి రుణాలకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. ప్రభుత్వం 2025 జనవరిలో జిల్లాలోని తొమ్మిది సామాజిక తరగతులకు 2,245 యూనిట్లను మంజూరు చేసింది. మొదటి వరుసలో రూ.48.63 కోట్లు విడుదలకు అంగీకరించింది. మొదటి విడతలో ఎంపిక కాని వారికి మరో రూ.5.84 కోట్లు వెరసి 54.47 కోట్లు అందజేయనుంది. బిసి కార్పొరేషన్ అధికార యంత్రాంగం ఆయా మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఉన్నఫళంగా నిధుల విడుదలకు బిఆర్‌ఒను విడుదల చేసింది. రాష్ట్ర ఫైనాన్స్ డిపార్టుమెంట్ పెండింగ్‌లో పెట్టడంతో దరఖాస్తుదారుల్లో అసహనం పెల్లుబికుతోంది.

జిల్లాలో గత ఫిబ్రవరిలో రూ.54.47 కోట్లతో బిసి, ఇబిసి సామాజిక తరగతులకు చెందిన యువతకు 2,172 యూనిట్ల మేరకు సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. రుణాల మంజూరుకు నిధుల విడుదలకు సంబంధించిన కసరత్తు పూర్తి చేసింది. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, కాపు తదితర కార్పొరేషన్ల ద్వారా రుణాలు బిసి కార్పొరేషన్ యూనిట్లు 1,550, ఇబిసి యూనిట్లు 74, కమ్మ కార్పొరేషన్ యూనిట్లు 27, రెడ్డి కార్పొరేషన్ యూనిట్లు 98, ఆర్యవైశ్య రుణ యూనిట్లు 17, క్షత్రియ కార్పొరేషన్ యూనిట్లు 16, బ్రహ్మణ కార్పొరేషన్ 08, కాపు కార్పొరే షన్ యూనిట్లు 379, కాపు ఎంఎస్‌ఎంఇ గ్రూపు రుణాలు 3 చొప్పున యూనిట్లు ఉన్న సంగతి తెలిసిందే. ఒక్కో యూనిట్ రూ.ఐదు లక్షలు, ఇబిసి యూనిట్ రూ.8 లక్షల చొప్పున కేటాయించింది. ఆయా యూనిట్లకు కేటాయించిన రూ.4.8 కోట్లలో రూ.2.39 కోట్ల సబ్సిడీ లభించనుంది. ఇబిసి రుణాలు, ఇతర తరగతుల కింద అర్హులైన వారికి యూనిట్‌కు రూ.ఎనిమిది లక్షల చొప్పున అందించనున్నట్లు తెలిపింది. ఇతర తరగతుల వారికి 73 యూనిట్లను సైతం మంజూరు చేసింది. రూ.4.8 కోట్లలో రూ.2.92 కోట్లు సబ్సిడీ లభించనున్నట్లు తెలిపింది..

ఫైనాన్స్‌లో బిఆర్‌ఒ పెండింగ్

స్వయం ఉపాధి రుణ యూనిట్ల మంజూరుకు బ్రేక్ పడింది. ప్రభుత్వం రూ.54.47 కోట్ల స్వయం ఉపాధి రుణాలకు నిధులు విడుదల చేస్తూ బిఆర్‌ఒను సైతం విడుదల చేసింది. బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ఫైనాన్స్ డిపార్టుమెంట్‌కు పంపించి నట్లు సమాచారం. ఉన్నఫళంగా రుణాల మంజూరు ప్రక్రియను నిలిపేసింది. బిసి, ఇతర సామాజిక తరగతులకు స్వయం ఉపాధి రుణాల మంజూరుకు మంత్రివర్గ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఎటువంటి సిఫారసులు చేయకుండా నిమ్మసుప్తావస్థలో ఉండడం నిరుద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది.

స్వయం ఉపాధి రుణాలు లేనట్లే!

జిల్లాలో 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం ఉపాధి రుణాలు లేనట్లేనని తెలుస్తోంది. 2025 అకడమిక్ ఇయర్ ముగింపు దశకు చేరుకుంది. 2026 ఆర్థిక సంవత్సరంలో వరుసగా మున్సిపల్, కార్పొరేషన్, పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో 2026 జనవరి నెలాఖరు నాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. లేనిపక్షంలో 2026 జూన్, సెప్టెంబర్ మాసాల మధ్య స్వయం ఉపాధి రుణాల మంజూరుకు అవకాశాలు ఉన్నాయనే అంచనాలు వినిపిస్తున్నాయి.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలోని విద్యార్థులు వంత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. విద్యా ప్రణాళికలపై శనివారం జిల్లా పునర్విభజనలో భాగంగా నూతనంగా అన్నమయ్య జిల్లాలోకి చేర్చబడిన పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లి, సదుం, సోమల మండలాలతో పాటు మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి మండల విద్యాశాఖాధికారులు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులతో డిఇఒ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మైస్కూల్-మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, విద్యార్థుల ప్రగతిపై పలు సూచనలు చేశారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను సమాయత్తం చేసేందుకు రూపొందించిన వంద రోజుల ప్రత్యేక కార్యాచరణ అన్ని పాఠశాలల్లో ఖచ్చితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన పలు కార్యక్రమాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లి ఏర్పడిన తర్వాత జరిగిన తొలి సమావేశం పట్ల ఆయన సంత ృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ అనురాధ, ఎఎల్ఎస్ వెంకట్రామయ్య, ఐఒఆర్‌ఇ జనార్ధన్, డిజిబిఒ సుమతి, ఎఎంఒ అసదుల్లా, డిసిఇబి గంగాధర్, డివైఇఒ లోకేశ్వర్ రెడ్డి, ఎంఇఒలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, పిఇటి, పీడీ సంఘం అధ్యక్షులు రమేష్ బాబు, ఆఫీస్ సూపరింటెండెంట్ రామకుమార్, అన్ని మండల విద్యాశాఖ అధికారులు, క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ సుబ్రమణ్యం

జిల్లా చరిత్రను దేశం నలుమూలల చాటేలా

గండికోట ఉత్సవాలు

- 11 నుంచి 13 వరకు అంగరంగ వైభవంగా నిర్వహణ
- నిర్వహణకు సర్వం సన్నద్ధం
- కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

జిల్లా చరిత్ర దేశం నలుమూలలా చాటేలా గండికోట ఉత్సవాలను ఈ నెల 11, 12, 13వ తేదీలలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గండికోట ఉత్సవాల నిర్వహణకు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధం కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జమ్మలమడుగు నియోజకవర్గం గండికోటలో ఉత్సవాల నిర్వహణ, సాస్కి పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉత్సవాలకు సంబంధించి సభా వేదిక, స్టాల్స్ ఏర్పాటు, పార్కింగ్, ఇతర సంబంధిత అంశాలపై ఆరాతీశారు. గండి కోట ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు తయారు చేసిన కార్యాచరణ ప్రణాళిక మేరకు చేయవలసిన ఏర్పాటు పై దిశా నిర్దేశం చేశారు. ఉత్సవాలను జిల్లా పర్యాటక, చారిత్రక, సాంస్క ృతిక వైభవాన్ని దేశం నలు దిక్కులా చాటేలా విస్తరింప జేసేలా కొన్ని ప్రధానమైన పనులను త్వరితగతిన పూర్తిచేస్తున్నాని చెప్పారు. ఉత్సవాలకు మునుపే పూర్తి కావాల్సిన పలుముఖ్యమైన పనులను పరిశీలించారు. ఎంట్రన్స్, వెలివేషన్, పార్కింగ్, అమినిటీ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిటిడిసి ఇంజినీర్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్‌లను ఆదేశించారు. గండికోట ప్రాంతాన్ని సాస్కి పథకం ద్వారా రూ.79 కోట్లతో అభివృద్ధి చేసి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. అందులో భాగంగానే పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. పర్యాటకులకు సంత ృప్తి కరమైన అనుభూతిని అందించేందుకు 10 వేల ఎస్ఎఫ్‌టి విస్తీర్ణంలో టూరిస్టు ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను, 4 వలే ఎస్ఎఫ్‌టి విస్తీర్ణంలో రెండు అమినిటీస్, ఇన్‌ఫర్మేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఒక టెంట్ సిటీ, 1.5 కిలో మీటరు మేరా గండికోట ఫోర్టు నుండి విజిటర్స్ సెంటర్ వరకు వాకింట్ ట్రెయల్‌ను నిర్మిస్తున్నారన్నారు. ఈ మార్గం మొత్తం కూడా వెహికల్ ఫ్రీ జోన్ఃగా కేటాయించి ఆ మార్గానికి ఇరువైపులా పర్యాటకులు చక్కటి ఆహ్లాదకరమైన అనుభూతిని పొందేలా పలు ప్రత్యేక నిర్మాణాలను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. గండికోట కొట్టాలపల్లె నుండి గండికోట రిజర్వాయర్, డ్యామ్ అందాలను వీక్షించడంతో పాటు, ఆ మార్గాన్ని కలిపే అనుకూలతలను, గండికోట గార్జ్ వ్యూ పాయింట్‌ను పరిశీలించారు. **మైలవరం జలాశయం పరిశీలన..** ఈ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ మైలవరం జలాశయాన్ని నీటినిలువ సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో జిలా టిడిపి అధ్యక్షులు భూపేష్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి సురేష్‌కుమార్, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయి శ్రీ, డిఆర్‌డిఎ, డ్వామా, మెప్మా పీడీ ఆదిశేషా రెడ్డి, రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ చంద్ర శేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు..

నూతన పరిశ్రమల ఏర్పాటుకు సహకారం

- మాట్లాడుతున్న ఎపిఐఐసి డైరెక్టర్ మహేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలో పారిశ్రామిక వాడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేసి వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ ప్రన్యూర్ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎపిఐఐసి డైరెక్టర్ డాక్టర్ మఘోర్స్ మహేష్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి ఎపిఐఐసి అన్నివిధాల సహకరిస్తుందని, అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రతి కుటుంబంలో నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదిగే విధంగా కృషి చేస్తారన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో త్వరలో అవగాహన సదస్సులు నిర్వహించి మరింత మంది పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్సెంటివ్స్ సబ్సిడీలు, ఇండస్ట్రియల్ ల్యాండ్స్ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు పారిశ్రామి కవేత్తలుగా ఎదగాలన్నారు.తద్వారా సాఫ్ట్ వేర్ కంపెనీలు, టమోటో పల్ప్ ఇండస్ట్రీస్, చింతపండు పల్ప్ ఇండస్ట్రీ, చేనేత రంగంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి మదనపల్లి జిల్లాను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకుమంత్రి, ఎమ్మెల్యే సహాయ, సహకారాలతో మన జిల్లాలోని ప్రతి పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించి త్వరలోనే మదనపల్లి, తంబళ్లపల్లి, పుంగనూరు, నియోజకవర్గంలో కొత్త ఎంఎస్‌ఎంఇ పార్కులు కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మదనపల్లిలోని మొలకలదిన్నె ఆటోనగర్ కూడా త్వరలో ల్యాండ్ అలెట్మెంట్స్ ప్రారంభించి పారిశ్రామవేత్తలకు అందజేస్తామన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని మదనపల్లి జిల్లాలోని ప్రజలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల కోసం 50 నుంచి 75 శాతానికి లేదా రూ.20 నుంచి రూ.25 లక్షల వరకు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని పెంచిందని గుర్తు చేశారు. ఈ సదవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న మహేష్

మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

మంత్రి ఫొటోలు ధ్వంసం నీతిమాలిన చర్య

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా

ప్రజాశక్తి - రాయచోటి

సంబేపల్లిలో శిలాఫలకంలో ఉన్న రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఫొటోను ధ్వంసం చేసే నీతిమాలిన పనులు వైసిపి నాయకులు మానుకోవాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం జిల్లా కంటే కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తప్పకుండా అభివృద్ధి చేస్తారని తెలిపారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అభివృద్ధి చూపించి రాయచోటి వాసుల రుణం తీర్చుకుంటారని తెలిపారు. వైసిపి నాయకుల రెచ్చగొట్టే ప్రసంగాలు వల్ల వారి పబ్బం గడుపుకోవాలని ఆలోచన చేస్తున్నారని చెప్పారు. శిలాఫలకాన్ని పగలగొట్టారంటే వారిలో ఎంత కుట్ర దాగి ఉన్న అన్న విషయం తెలుస్తుందని తెలిపారు. జిల్లా మార్పు అందరికీ బాధగానే ఉందని పేర్కొన్నారు. కానీ జిల్లా కంటే కూడా ఎక్కువగా రాయచోటిని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారని తెలిపారు. ఇకనైనా వైసిపి నాయకులు కుట్రలు, కుతంత్రాలు మానుకోవాలని హితవు పలికారు. ఇలాంటివి ప్రజలు సహించరని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు శివారెడ్డి, జయరాంరెడ్డి, సాంబశివరెడ్డి, రమణారెడ్డి, రోఫా పాల్గొన్నారు.

డిఇఒ సుబ్రహ్మణ్యంకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

డిఇఒ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యంను విజయభారతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.సేతు ఘనంగా సన్మానించారు. విజయభారతి పాఠశాలను శనివారం డిఇఒ సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ సేతు డిఇఒ సుబ్రమణ్యంకు వెంకటేశ్వరస్వామి ప్రతిమ బహూకరించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. డిఇఒ మాట్లాడుతూ పాఠశాలలో విద్యాప్రమాణాలు, మౌలిక సదుపాయాలు బేషుగ్గా ఉన్నాయని ప్రశంసించారు. ప్రయివేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ డిఇఒ సుబ్రహ్మణ్యం ఎంతో సమర్థవంతమైన అధికారని, ఆయన సారధ్యంలో జిల్లాలో విద్యాశాఖ ప్రగతి పథంలో పయనిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మదనపల్లె విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

6, 7న అండర్-14 బాలుర టాలెంట్ స్పాటింగ్ ఎంపికలు

ప్రజాశక్తి - కడప

ఈ నెల 6, 7వ తేదీలలో అండర్-14 పురుషుల టాలెంట్ స్పాటింగ్ ఎంపికలు కడపలోని వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు హాజరుకావాలన్నారు. క్రీడాకారులు తమతోపాటు ఆధార్ కార్డు కాపీ, బర్త్ సర్టిఫికెట్(ఫారం-5) సర్టిఫికెట్, బర్త్ ప్లేస్ సర్టిఫికెట్‌తో పాటు ఒక పాస్ పోర్ట్ సైజ్ ఒరిజినల్స్‌తో ఒక సెట్టు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఎవరి క్రికెట్ కిట్ బ్యాగులు కూడా వారే తీసుకురావాల్సింది ఉంటుందని తెలిపారు. ఎంపికలు ఉదయం 8:00 గంటలకు కడప వైఎస్ఆర్ స్టేడియంలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఇదివరకు ఎప్పుడూ జిల్లాకు ఆడకుండా ఉండేవారు మాత్రమే ఎంపికలకు రావాల్సిందిగా కోరారు. 2011 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. క్రీడాకాలు తెల్లటి దుస్తులతో హాజరుకావాలన్నారు.

దాడులు ఆటవిక పాలనకు నిదర్శనం

- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

ఎన్నికల సందర్భంగా ప్రలజకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోగా, ఆవిషయమై ప్రశ్నిస్తున్న వైసిపి కార్యకర్తలపై భౌతికదాడులకు పాల్పడడం అత్యంత దుర్మార్గమైన చర్య అని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి కార్యకర్దలపై తరచూ జరుగుతున్న భౌతికదాడులు ఆటవిక రాజ్యాన్ని తలపిస్తున్నాయన్నారు. మట్కా, గంజాయి బ్యాచ్‌లు, ముసుగు దొంగలు సిగ్గులేకుండా బడుగు, బలహీన, పేద వర్గాల ప్రజలపై దాడులకు తెగబడడం అత్యంత సిగ్గుచేటన్నారు. రామపురం మండలం చిట్లూరు గ్రామం చెరువుముందరపల్లెకు చెందిన రామచంద్రారెడ్డిపై కొందరు ముసుగువ్యక్తులు కర్కశంగా, నిర్దాక్షిణ్యంగా దాడిచేయడం హేయమైన చర్యని పేర్కొన్నారు. జిల్లా కేంద్రం పోయిందన్న బాధను వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టిన వారిపై దాడులు చేయించడం ఏరకమైన రాజకీయమని ప్రశ్నించారు. తనపై దాడిచేస్తారో, హత్యచేస్తారో రండి అంతేకాని కార్యకర్తలు, ప్రజా సంఘాల వారిపై దాడులకు దిగడం పిరికిపందచర్యని పేర్కొన్నారు. దాడులు పెరగడానికి పోలీసు వ్యవస్థ సక్రమంగా స్పందించకపోవమే ప్రధాన కారణమని తెలిపారు. సంబేపల్లె మండలంకు చెందిన వైసిపి నేత ప్రతాప్‌రెడ్డి సహా పార్టీ కార్యకర్తలను పోలీసులు విచారణపేరుతో పోలీసుస్టేషన్‌కు తరలించడం అనుచితమన్నారు. కూటమి పార్టీనేతలు భౌతికదాడులకు దిగడం మానుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకో వలసి వస్తుందంటూ హెచ్చరించారు.

జిల్లా అభివృద్ధికి బాటలు వేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె కేంద్రంగా నూతనంగా ఏర్పాటైన మదనపల్లె జిల్లా అభివృద్ధికి బాటలు వేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను ఎపిఎస్‌ఆర్‌టిసి 1, 2 డిపోల ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి కోరారు. శనివారం స్టేట్ హజ్ కమిటీ డైరెక్టర్, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్‌ఖాన్‌తో కలిసి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగూరు వలి మాట్లాడుతూ అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణం, చారిత్రాత్మక నేపథ్యం కలిగిన మదనపల్లె జిల్లా కేంద్రం కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కనుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు, డిఎస్‌పి మహేంద్ర, డిఇఒ సుబ్రహ్మణ్యం సమర్థవంతమైన అధికార బృందం జిల్లా కేంద్రంలో కొలువు తీరడం శుభ పరిణామన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, అధికార యంత్రాంగం కలయికలో మదనపల్లి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆకాంక్షించారు.

మంత్రిని కలిసిన ఎన్‌జిఒ నేతలు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎపి ఎన్‌జిఒ అన్నమయ్య జిల్లా నేతలు శనివారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి ధీరజ్ కునుబిల్లిలను కలుసుకున్నారు. వారిని నూతన సంవత్సర శుభకాంక్షలు తెల్పడంతో పాటు ఎన్‌జిఒ సంఘం డైరీ, కేలండర్‌లను అందచేశారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసన్, జిల్లా నేతలు నాగేశ్వరరావు, డి.వి.శివారెడ్డి, మహదేవ, మదనపల్లె తాలుకా అధ్య క్షుడు రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

మోదం..ఖేదం

ప్రజా'దృష్టి'

జిల్లాల పునర్విభజన కొందరిలో మోదం..మరికొందరిలో ఖేదాన్ని నింపింది. మదనపల్లి కలెక్టర్ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎటువంటి సందడి వాతావరణం కనిపించలేదు. రాయచోటిలో నూతన సంవత్సర వేడుకల వాతావరణ ఆనవాళ్ల జాడే కనిపించలేదు. జిల్లాల పునర్విభజనలో అన్నమయ్య జిల్లా అస్థిత్వమే గల్లంతు కావడం తటస్తులను, మేధావులను సైతం నిర్ఘాంతపరిచింది. అన్నమయ్య జిల్లాకు చెందిన రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని నిరసనలు, ఉద్యమాలు చేసిన దాఖలా ల్లేవు. రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడమేమిటో తెలియడం లేదు. రాష్ట్రంలోని పార్లమెంట్ కేంద్రాలను జిల్లా కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్ ఇచ్చిన హామీని ఉల్లంఘించి రాజంపేట వాసులను తీవ్ర నిరాదరణకు గురిచేసిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికలు రానే వచ్చాయి. ఎన్నికల్లో శృంగభంగం తప్పలేదు. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకత్వం తరుపున టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు అధికారం చేపట్టారు. అనంతరం శాస్త్రీయ విభజన పేరుతో జిల్లాల విభజనపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం పలుమార్లు పర్యటించి నివేదికను అందించింది. విభజన అనంతర పరిణామాలను పరిశీలిస్తే పునర్విభజనలో శాస్త్రీయతకే అవకాశం లేదనే వాదన బలంగా వినిపించింది. ఉదాహరణగా వైఎస్.జగన్ హయాంలో రాయచోటిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారు. రాజంపేట వాసులు మాత్రమే విలపిస్తే, కూటమి తరుపున అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు రాయచోటి, రాజంపేట వాసులిద్దరిని విలపింపజేయడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. చివరికి ముఖ్యమంత్రి చంద్రబాబు తన కేబినెట్ సహచరుడైన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సైతం కన్నీటి పర్యంతమయ్యారు. ఒకటి అన్నమయ్య జిల్లా అస్తిత్వం గల్లంతు కావడం, రెండవది జిల్లా కేంద్రం మార్పు అంశాల్లో సహచర మంత్రివర్గ సహచరుడినా, సహచర ప్రజాప్రతినిధులనా, ఓట్లేసి గెలిపించిన ప్రజలనా ఎవరిని సంతృప్తి పరిచినట్లో ఏలికలకే ఎరుక. ఇదిలాఉండగా ఒక రాజకీయం వంతు వచ్చింది. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబాన్ని చిత్తూరు జిల్లా నుంచి తప్పించి, ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయంగా తనకు ఎదురు లేకుండా చేసుకున్నారనే వాదన గట్టిగా వినిపిస్తోంది. పెద్దిరెడ్డి అసెంబ్లీ స్థానమైన పుంగనూరును అన్నమయ్య జిల్లాకు తరలించి రాజకీయంగా దెబ్బతీయాలనే ఎత్తుగడ కారణంగానే అశాస్త్రీయమైన, నిరంకుశమైన శమైన విభజన నిర్ణయం తీసుకున్నారనే విమర్శ వినిపిస్తోంది. వైసిపి హయాంలో ఏర్పాటు చేసిన రాయచోటి జిల్లా కేంద్రాన్ని రాజంపేటకు మార్చినా రాజంపేట, రైల్వేకోడూరు వాసులు హర్షించే వారేమో, ప్రస్తుత విభజన కారణంగా రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల ప్రజల మనసుల్లో కూటమి పట్ల తీవ్ర వ్యతిరేకతను పాదుగొల్పినట్లు అయిందనే వాదన వినిపిస్తోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సుగవాసి ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న దర్బార్, పఠాన్‌ఖాన్

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీ, జికె.రాచపల్లికు చెందిన పి.దర్బార్, ఆయన సోదరుడు పఠాన్‌ఖాన్ తమ అనుచరులతో కలిసి శనివారం రాయచోటిలోని టిడిపి కార్యాలయంలో రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు సుగవాసి ప్రసాద్‌బాబు సమక్షంలో టిడిపిలో చేరినట్లు తెలిపారు. అనంతరం సుగవాసిని పూలమాల, దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కువైట్‌లో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషాను కలిసి చర్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో టిడిపి మరింత బలపడేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

వైసిపి కార్యకర్తపై దాడిలో టిడిపి ప్రమేయం లేదు

ప్రజాశక్తి-రామాపురం

వైసిపి కార్యకర్త రామచంద్రరెడ్డిపై జరిగిన దాడికి టిడిపికి ఎలాంటి ప్రమేయం లేదని రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గం టిడిపి ఆర్గనైజర్ సెక్రెటరీ గంప వెంకటరమణ, అధికార ప్రతినిధి చింతల రామక ృష్ణ గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడుతూ రామచంద్ర రెడ్డి ప్రవర్తన, మాట్లాడే భాష, మహిళల పట్ల అతని ప్రవర్తన నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలుసన్నారు. ఎవరితో ఎలా ప్రవర్తించాడో ఎవరు దాడి చేశారో తెలియదని అలాంటప్పుడు టిడిపి కార్యకర్తలపై నిందలు వేయడం, టిడిపి గుండాలంటూ సంబోధించడం వైసిపి నాయకులు, కార్యకర్తలకు తగదన్నారు. ఎవరూ దాడి చేసినా దాన్ని టిడిపికి అంటగట్టడం తగదన్నారు.

మాజీ జడ్‌పిటిసికి పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని హసనాపురం పంచాయతీ ఎర్రింగి వాళ్ళ పల్లెలో మాజీ జడ్‌పిటిసి నాగసుబ్బారెడ్డిని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి కుమారుడు నిశ్చన్ నాగిరెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వయసు పైబడిన తర్వాత ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్ రెడ్డి, ఎంఎల్.వెంకట్రాంరెడ్డి, ధర్మారెడ్డి, ఖాదర్ బాషా టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సహకారంతో అభివృద్ధి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతుల సహకారంతో అభివృద్ధి చెందుతుందని గాలివీడు సింగిల్ విండో అధ్యక్షులు వెలిగింటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అయన ఆధ్వర్యంలోఎల్‌టి లోన్ చెక్కులు రైతులకు పంపిణీ చేశారు. ఈ సంవత్సరం క్యాలెండర్‌ను ఓపెన్ చేసి రైతులకు అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.చంద్రశేఖర్ రెడ్డి,భద్రప్ప నాయుడుమరియు రైతులు అరవీటి అమరనాథ రెడ్డి, శీలం. భాస్కర్ నాయుడు, దొరస్వామి నాయుడు, వేమారెడ్డి, ధర్మారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, మహేష్ బాబు, కానాల ఈశ్వరమ్మ సంఘ సిఇఒ బి.ప్రతాపరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం యువతకు స్ఫూర్తి

ప్రజాశక్తి-నందలూరు

బ్రహ్మం చౌదరితో రేవూరి వేణుగోపాల్

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మంచౌదరి యువతకు స్ఫూర్తిదాయకమని టిఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణు గోపాల్ పేర్కొన్నారు. శనివారం విజయవాడ ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఎపి కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నాదెండ్ల బ్రహ్మం చౌదరి ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి యువత అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మం చౌదరికి అభినందనలు తెలిపారు.

కెకె చౌదరి పదవీకాలం పొడిగింపుపై హర్షం వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

ఖాదీ బోర్డు చైర్మన్ పదవీకాలం పొడిగింపుపై హర్షం

ప్రజాశక్తి-చిట్వేలి

రాష్ట్ర ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీ చైర్మన్‌గా కెకె.చౌదరిని నియమించి సంవత్సర కాలం పూర్తయింది. పదవీకాలం రెండుసంవత్సరాలు కాగా ప్రభుత్వం అధికారికంగా మరో సంవత్సరం అదనంగా మూడేళ్ళ అదే పదవిలో కొనసాగేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ సంబరాలు చేసుకున్నారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన కెకె చౌదరి పార్టీ గుర్తించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలు రామానులు నాయుడు, కాకర్ల సుబ్బరాయుడు, గుండయ్యాయాదవ్, అనంతయ్యాయాదవ్, నాగార్జుననాయుడు, శంకర్‌యాదవ్, బాబు, గూడూరు నాగరాజు, చక్రవర్తుల వెంకటేశ్వరరాజు, బాలకృష్ణయాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి : జడ్జి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని తంబళ్లపల్లి జెసిజె కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ అన్నారు. శనివారం శ్రీనివాసకాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటుచేసి చట్టాలు, న్యాయాలు, పర్యావరణ సమస్యలు, లోక్ అదాలతప్‌పై అవగాహన కల్పించారు. చుట్టూ ఉన్న పరి సరా లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అవి వృక్షాలు అయ్యేంత వరకు సంరక్షించానలి పేర్కొన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యానేరమని, 18 సంవత్సరాల్లోపు బాలికలకు వివాహం చేస్తే శిక్షార్హులవుతారని తెలిపారు. మహిళా సంరక్షణ చట్టాలను తెలుసుకొని ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న చిన్న విషయాలను పెద్దవిగా చేసుకోవద్దన్నారు. తోటి వారితో స్నేహభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిల్‌కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జడ్జి ఉమర్‌ఫరూక్

సావిత్రిబాయి పూలే ఆదర్శప్రాయులు

మదనపల్లి : విభిన్న ప్రతిభావంత ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సాయిత్రిభాయిపూలే అని బాస్‌నాయకులు కొనియాడారు. నగర పంచాయితీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రి బాయి పూలే జయంతిని బాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రెండు వందల ఏళ్ల క్రితం విద్యావిప్లవ క్రాంతి సావిత్రిబాయి పూలే వేసిన విద్య పునాదులే నేటి స్త్రీ స్వేచ్ఛకు ప్రధాన కారణమన్నారు. కులమతాల పేరుతో తరతరాలుగా అణచివేతకు గురైన నిమ్నజాతి ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అర్ధాంగి సావిత్రిబాయిపూలే కొనియాడారు. మహిళల సాధికారతకు నిలువెత్తు రూపం భారతదేశంలో మహిళా విద్యకు పెద్దపీట వేస్తూ అట్టడుగువర్గాలకు చెందిన స్త్రీలు చదువుకునేందుకు ఆమె పాఠశాలలు ప్రారంభించి తన భర్తతో కలిసి సత్యశోధక సమాజాన్ని స్థాపించి బాల్య వివాహాలు మూఢనమ్మకాలను నిర్మూలన, రూపుమాపటం,వితంతు పునర్వివాహం కోసం శ్రమించారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్ నాయక్, అధ్యాపకులు నాగ రత్నమ్మ, అనూష, రఘునాథ్, మండల ఎన్.ఎస్.ఎస్ కో–ఆర్డినేటర్ శేషాద్రి, బాస్ నాయకులు సింగన్న పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :**మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, జడ్పీ హైస్కూల్ (తెలుగు)లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జన్మదినం సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలోని పురుష ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయులను శాలువతో ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్‌ఎం రవీంద్ర, వెంకట గోపాల్, శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** మహిళాభ్యుదయం, స్త్రీ విద్య లక్ష్యంగా సేవా కార్యక్రమాలు చేపట్టిన సావిత్రిబాయి పూలే బాలికల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని నవజీవన్ వెల్ఫేర్‌సొసైటీ జనరల్ సెక్రెటరీ జి. కృష్ణమూర్తి తెలిపారు. సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను స్థానిక ఈశ్వరమ్మ కాలనీలోని జడ్‌హై స్కూల్‌లో నవ జీవన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సావిత్రి బాయిపూలే చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఆమె ఆశయ సాధనకు నేటి బాలిక లు విద్యలో రాణించి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురునాథం, మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం దిలీప్ కుమార్, ఉపాధ్యాయులు మంజులమ్మ, కాశీనాథ్, లక్ష్మీదేవి, కల్పన, నవజీవన్ సొసైటీ ప్రెసిడెంట్ పద్మావతమ్మ, భగత్ సింగ్ యూత్ ప్రెసిడెంట్ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు. బహుజనసేన ఆధ్వర్యంలో స్థానిక మహిళ డిగ్రీ కళాశాల నందు సావిత్రిబాయి జయంతి వేడుకలు నిర్వహించి ఆమె చిత్రపటం వద్ద ఘన నివాళులు అర్పించారు. బహుజన సేన నాయకులు జయశంకర్, రాఘవ యాదవ్, చైతు, ప్రిన్సిపల్ సూర్యశేఖర్, అధ్యాపకులు శ్రీనివాసులుపాల్గొన్నారు. **పోర్డు ఆధ్వర్యంలో ..** పోర్డు సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌టి గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు.ప్రిన్సిపల్ రంగనాయకులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శేఖర్, తులసి, కల్పన, ఫోర్డ్ సిబ్బంది జలజ, జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. **వీరబల్లి :** మండలంలోని మట్లి పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ సుస్మిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే సతీమణి మహిళల అక్షరాస్యత కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు. మహిళలు ఆమెను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. బహుజన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పల్లం రామచంద్ర మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించడానికి జిల్లా వ్యాప్తంగా వందసావిత్రిబాయి చిత్రపటాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. సహకరించిన అన్నమయ్య జిల్లా బహుజన్ టీచర్స్ అసోసియేషన్ కమిటీకి వారు కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** ఎంపిపిస్ కె.రెడ్డివారిపల్లి, కలికిరిలో ఎపి టీచర్స్ ఫెడరేషన్‌జిల్లా అధ్యక్షులు కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.చదువుల తల్లి, పూర్వ ఆదర్శ గురువు, తొలి మహిళా ఉపాధ్యాయిని మహోన్నత సేవలను అందరు స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్, బాలికల జూనియర్ కళాశాలలో ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతనజాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్లోరీ కిరణ్ ఉజాల, విజయ కుమారి, గౌరీ, జ్యోతి ప్రియ, గీత, ఆర్.వి. రమణమ్మ, గాయత్రీ దేవి, సుమలత, అరుణ జ్యోతి, నాగలక్ష్మి లను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. **గాలివీడు :** స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్. జాబిర్ ఆధ్వర్యంలో సావిత్రి బాయిపూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులు సాజిదాబి, పర్వీన్‌బేగం, ఫాతిమున్నిసా, జమాల్ బి, నజ్మా, ప్రాథమిక పాఠశాల పెద్దూరులో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయిని నాగసుశీలను ఘనంగా సన్మానించారు. **రాయచోటి అర్బన్ :** సంఘసంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయిః, స్త్రీ విద్యావ్యాప్తికి విశేషంగా కృషిచేసిన సావిత్రిబాయిపూలే ఆశయసాధనకు అందరూ పునరంకితం అవుదామని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలోని జిల్లా బిసి సంఘం కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సావిత్రిబాయ్ పూలే తన భర్త జ్యోతిరావుపూలే వద్ద చదువు నేర్చుకున్న 1848 జనవరి 1వ తేదిన దేశంలోనే తొలిబాలికల పాఠశాలను స్థాపించి ,అందులో తొలిఉపాధ్యాయినిగా బోధించింద న్నారు. తన జీవితంలో 52 పాఠశాలలను నెలకొల్పి విద్యతోనే బడుగు,బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని చాటిచెప్పారన్నారు. ఆ కార్యక్రమంలో బిసి సంఘం నేతలు తరిగొండ ఈశ్వరయ్య, గుల్బర్గా ఖాజావలి, గాండ్లపెంట ఖాదర్‌బాష, పాలగిరి హబీబుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరతో పాటు పలువురు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : సన్మానం పొందిన ఆర్ రాచపల్లి జడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయులు రేవతి, సురేఖ, సుధా

భూ సర్వేతో రెవెన్యూ సమస్యలకు చెక్

- మదనపల్లి సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి

రైతుకు పట్టాదారు పాస్‌పుస్తకాన్ని అందిస్తున్న సబ్‌కలెక్టర్ కల్యాణి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను శనివారం నిమ్మనపల్లెలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి తహశీల్దార్ తపస్విని, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులతో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గతంలో రైతులు అనేక భూ సమస్యలతో బాధపడుతూ ఉండేవారన్నారు. భూములను సాఫీగా, వార సత్వంగా పంచుకోవడానికి ఇబ్బందులు పడుతూ ఉండేవారని తెలిపారు. తమ భూముల సమస్యలను పరిష్కరించుకోవడానికి కార్యాలయాల చుట్టూ కాళ్ల అరిగేలా తిరుగుతూ పరిష్కారం కోసం ఎదురు చూసేవారన్నారు. భూ సమస్యలతో బాధపడుతున్న రైతుల బాధలను గుర్తించిన ప్రభుత్వం భూ రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అత్యాధునిక సాంకేతికత జోడింపుతో భూసమస్యకు చెక్ పడుతుందన్నారు. భూ రీ సర్వేలో రెవెన్యూ అధికారులు రైతులను సమన్వయం చేసుకొని వారి సమక్షంలోనే భూమిని సర్వే చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఇప్పటివరకు టీ.చౌకిళ్ళవారిపల్లె, తవళం, నిమ్మనపల్లె, అగ్రహారం గ్రామాలలో పూర్తిస్థాయిలో భూ రీ సర్వే కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో మిగిలిన గ్రామాలలో ప్రస్తుతం రీ సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. పూర్తిస్థాయిలో రీ సర్వే జరిగిన గ్రామాలలోని రైతులకు పాత పట్టాదారు పాసుపుస్తకాల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో, క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. భూ రీ సర్వే కార్యక్రమంలో రెవెన్యూ అధికారులకు రైతులు సహకరించి, తమ భూములను క్షేత్రస్థాయిలో సమగ్రంగా సర్వే చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు పాపులమ్మ మల్లప్ప, టిడిపి మండలాధ్యక్షులు పుర్రా వెంకటరమణ, రాజంపేట మీడియా కో–ఆర్డినేటర్ మద్దూరి శ్రీపతి, మాజీ ఎంపిపి పారిజాత మల్లికార్జున, సుధాకర, లక్ష్మన్న, రమణ, రెడ్డప్ప, డిటి సిరాజుద్దీన్, ఆర్.ఐ రమేష్, మండల సర్వేయర్ గోపీనాథ్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, విఆర్‌ఒలు, రెవిన్యూ సిబ్బంది, ఎఎస్ఐ జిల్లాని భాష, హెడ్ కానిస్టేబుల్ నవయుగనాథ్, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, పరిసరాలను శుభ్రం చేయించి ప్రజల ఆరోగ్యా నికి ప్రథమ ప్రాధాన్యతను కల్పిస్తున్నట్లు ఎంపిడిఒ ఫకృద్దీన్ అన్నారు. శనివారం వెంగంవారిపల్లె గ్రామంలో పంచాయతీ అభివృద్ధి అధికారి నాగభూషణం, సర్పంచ్ శ్రీవాణి నవీన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఎఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంగంవారిపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు విస్తృతంగా పరిసరాలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. వెంగంవారిపల్లె, సఖి బండవా రిపల్లెలోని వీధులలోని చెత్తను, వ్యర్థాలను, బస్సు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పేడ దిబ్బలను, ముళ్ళ పొదలను, ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేసి డంపింగ్ యార్డ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామాలలో సురక్షితమైన తాగు నీరును ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. చెత్త సేకరణకు పారిశుధ్య కార్మికులు పల్లెల్లోని ప్రతి ఇంటి కి వస్తున్నారని, ప్రతి ఇంటివద్ద చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తు న్నామన్నారు. ప్రజలు కూడా వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవే వద్దని, చెత్త బండిలోనే చెత్తను వేయాలన్నారు. మన ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను వ్యర్థాలతో నింపుకోవడం ద్వారా వచ్చే దుర్వాసనలతో అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వివరించారు. వ్యర్థాల నిల్వతో దోమల ప్రబలి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన ప్రజలు పడాల్సి ఉంటుందని హెచ్చరించారు .కార్యక్రమంలో పంచాయతీ అభివ ృద్ధి అధికారి నాగభూషణం, సర్పంచు శ్రీవాణి నవీన్, టిడిపి నాయకులు ఓబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెంగంవారిపల్లిలో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

ప్రమాదాల నివారణలో డ్రైవర్లకు ఏకాగ్రత అవసరం

మాట్లాడుతున్న ఎంవిఐ విజయలక్ష్మి

ప్రజాశక్తి-పీలేరు

వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు తమ మనుసును ప్రశాంతంగా ఉంచుకొని ఏకాగ్రతతో వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని పీలేరు ఎంవిఐ అధికారి విజయలక్ష్మీ తెలిపారు. జాతీయ భద్రతా మాసోత్సవాలను పురష్కరించుకొని శనివారం పీలేరు ఆర్‌టిసి గ్యారేజీ ఆవరణంలో డిపో మేనేజర్ ఎస్ఎండి రోషన్ అధ్యక్షతన ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ ప్రధానంగా డ్రైవర్లు ప్రమాదాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాము నడిపే వాహనంలో ప్రయాణికుల రక్షణే కాకుండా ఇంటి దగ్గర తమపై ఆధారపడిన ఓ కుటుంబం కూడా ఉందన్న విషయాన్ని గమనించుకోవా లన్నారు. గ్యారేజ్ ఉద్యోగులకు బస్సుల్లో బ్రేక్ డౌన్ సమస్యలు రాకుండా మన్నికైన మెయింటెన్స్ ఇవ్వాలని తెలిపారు. డ్రైవర్లకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సిఐ ధనుంజయులు, గ్యారేజ్ ఇన్‌ఛార్జి హరినాథ్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి, గ్యారేజీ ఇన్‌ఛార్జి, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, స్టోర్స్, ట్రాఫిక్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

బాధితురాలికి సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మీ

సిఎం సహాయనిధి పేదలకు భరోసా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

సిఎం సహాయనిధి పేదలకు భరోసానిస్తుందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవశ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ పేర్కొన్నారు. మండలానికి చెందిన కస్తూరి లక్ష్మీదేవికి సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.66,713లు చెక్కును వారి నివాసం వద్దకు వెళ్ళి అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి కష్టాల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మి పేర్కొన్నారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపండి

ప్రజాశక్తి - నందలూరు

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పాఠశాల యాజమాన్యం

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టకుండా ఆదేశించాలని స్థానిక శ్రీ అన్నమాచార్య అకాడమీ హైస్కూల్ యాజమాన్యం మాడపూరి హేమలత, ప్రధానోపాధ్యాయులు బాలాంజనేయులు, విద్యార్థులు మండల తహశీల్దార్ అమరేశ్వరికి వినతి పత్రం అందించారు. సెల్ టవర్ నిర్మాణం వలన టవర్ నుంచి విలువడే రేడియే ౹షన్ వలన వచ్చే అనారోగ్య సమస్యలను తహశీల్దార్‌కు వివరించినట్లు తెలిపారు. తమ పాఠశాలలో నర్సరీ నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉన్నారని ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో విద్యార్థులు ఉంటారని అందువల్లన పిల్లలు రెడియేషన్ బారినపడి చర్మ వ్యాధులు, ఇతరత్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. నివాస గృహలకు, పాఠశాలకు దూరంగా ఈ సెల్ టవర్ నిర్మించుకోవాలని సంబంధిత వారికి ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఇబ్రహీం ఖాళీలుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

11 మంది కార్యకర్తలకు అవార్డులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని 11 మంది ఉత్తమ టిడిపి కార్యకర్తలకు ఎంపిక చేసి అవార్డులను అందిం చినట్లు టిడిపి నాయకులు మాలేపాటి శివరాంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాజంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపికైన 36 మంది ఉత్తమ కార్యకర్తల అవార్డు గ్రహీ తలలో సుండుపల్లి మండలం నుండి ఏకంగా 11 మంది నిలవడం మనందరికీ గర్వకారణమన్నారు. సిఎం చంద్రబాబు ఆశయ సాధనలో, లోకేష్ అడుగు జాడల్లో నడుస్తూ, పార్టీ కోసం క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేసే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని నిరూపించారని పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు నాయకత్వంలో కార్యకర్తలను కాపాడుకుంటూ వారి సేవలను గుర్తించడం అభినందనీయమన్నారు.

అవార్డు అందుకుంటున్న మాలేపాటి సూరీనాయుడు

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యల కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటనలు శనివారం చోటు చేసుకున్నాయి. బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..నిమ్మనపల్లి మండలం గారుబురుజుకు చెందిన రెడ్డిబాబు కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమ నించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామస ముద్రం మండలం, చెంబకూరుకు చెందిన లక్ష్మీదేవి కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురైంది. పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. వాల్మీకిపురం, కోనేరు వీధికి చెందిన నరసిం హులు కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఈ మూడు కేసులపై ఆయా పరిధిలోని పోలీసులు విచారణ చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-గాలివీడు

మహిళ నుంచి రూ.18లక్షలు నగదును దోచుకెళ్లిన ఇద్దరు నిందితులను 24గంటల్లోపే అరెస్టు చేసినట్లు రాయచోటి డిఎస్‌పి ఎం.ఆర్. కృష్ణమోహన్ తెలిపారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31న మండలంలోని నూలివీడు ఎంపిపి స్కూల్‌లో పనిచేస్తున్న పందికుంట ఈశ్వరమ్మ తన దగ్గర ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలను స్థానిక ఎస్‌బిఐ బ్యాంకులో తాకట్టు పెట్టి రూ2.18లక్షలు రుణాన్ని తీసుకుందని తెలిపారు. ఆడబ్బును లెక్కిస్తుండగా గమనించి షేక్ మహమ్మద్, బాబా ఫకృద్దీన్ గమనించి ఆనగదును దొంగిలించాలని పన్నాగం పన్నారని పేర్కొన్నారు. నగదుతో బ్యాంకు నుంచి పాఠశాలకు వెళుతున్న ఈశ్వరమ్మను ద్విచక్రవాహనంలో వెంబడించి కత్తితో బెందించి నగదును దోచుకెళ్లారని తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ హెచ్.కృష్ణంరాజునాయక్, ఎస్ఐ జె.నరసింహారెడ్డి, పోలీసు సిబ్బంది చాకచక్యంగా 24గంటల్లోపే గోపనపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నిందితులను అరెస్టు చేశారని తెలిపారు. వారి నుంచి నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నిందితుల అరెస్టును చూపుతున్న డిఎస్‌పి కృష్ణమోహన్